# మనసున మనసై...

## — ఇందూ రమణ

డిసెంబర్ 31.

జీవిత కాలయానంలో మరో ఏడాది గడిచిపోతోంది. బ్రతుకు ప్రయాణంలో ఇంకో మైలురాయి దాటిపోతోంది.

ఆలోచిస్తూనే గోడ గడియారం కేసి చూసింది.

ఎనిమిది కావస్తోంది.

పిల్లలిద్దరూ తదేక దీక్షతో పుస్తకాలతో తపస్సు చేస్తున్నారు.

హాల్లోకొచ్చి వాలు కుర్చీలో మేనువాల్చి 'టీవీ' ఆన్ చేసింది సునీల.

నవ్వుల్ని మొహానికి పౌడర్‌లా అద్దుకొని రాబోయే నూతన సంవత్సరానికి నవ్యరీతుల్లో శుభాకాంక్షలు తెలుపుతున్నారు అనౌన్సర్లు.

ఆమె చూపుల్నిగాని...

ఆమె మనసుని గాని...

రంగుల 'టీవీ' ఆకర్షించలేకపోతోంది.

ఇంకా ఏడాది గడవడానికి నాలుగ్గంటలే ఉంది.

నా..లు..గు..గం..ట..లు!

ఆమె హృదయంలో ఆమెకే తెలియని ఏదో తియ్యని సవ్వడి. ఎవరికీ అర్థంకాని అందమైన స్పందన.

ఇన్నేళ్ళ తన వైవాహిక జీవితంలో ఎన్నడూ కలగని ఏదో కలవరం.

నలభై ఏళ్ళ ప్రాయంలో తన మనసెందుకిలా పులకిస్తోందో అర్థం కాలేదు సునీలకు.

చిరుప్రాయం నుంచి చదువే ప్రాణంగా ఎదిగింది. సనాతన సాంప్రదాయాలను ఆరాధించే కుటుంబంలో జన్మించిన సునీల తల్లిదండ్రుల నీడలో అపర

**ఎదిగిన పిల్లల ముందు తన హుందా...హోదా మర్చిపోయి మరోలా ప్రవర్తించ గలదా?/సమాజానికి...సంసారానికి తలొగ్గి సంస్కారంతో మనసుని మెదడుని అదుపులో పెట్టుకుంది సునీల.**

'సరస్వతీదేవి'గా అవతరించింది.

భావి భారత పౌరులను తీర్చిదిద్దే చదువుల తల్లిగా అవతారమెత్తింది.

పాఠశాలే ప్రాణంగా, పిల్లలే దైవంగా ప్రాణపథంగా ఎంచుకున్న వృత్తిలో లీనమై జీవిస్తోంది సునీల.

ఆదరంతో అభిమానించే భర్త...

ఆణిముత్యాల్లాంటి పిల్లలు...

ఇదే స్వర్గమనుకుంది.

ఈభాగ్యం చాలనుకుంది.

ఈ జీవితానికీ వరం చాలనుకుంది.

కానీ-

దైవమే దెయ్యమై పీడిస్తుందని కలలోనైనా వూహించలేదు. కనికరించి కాపాడ వలసిన కరుణామయుడే కరకు కసాయిలా కసితో తన కాపురాన్ని కాటేస్తాడని గ్రహించలేకపోయింది సునీల.

నలభై ఏళ్ళు నిండకుండానే రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డ భర్త రూపం కళ్ళల్లో మెదిలేసరికి ఆమె మనసు చెమ్మగిల్లింది.

తోడూ-నీడా లేకుండా నోరులేని పసిపిల్లల ఆలనా పాలనా చూస్తూ మోడులా జీవితాన్ని సాగిస్తోంది.

ఆరేళ్ళు-!

అనుక్షణం వెన్నంటి అన్నీతానై కళ్ళల్లో పెట్టుకు చూసుకున్న భర్తకు దూరమై ఆరేళ్ళు......ఈ ఆరేళ్ళు ఎంత యాతన అనుభవించింది.

ఆనందం గాని-

ఆవేదన గాని-

ఆలోచన గాని-

ఆశలుగాని- పంచుకోవడానికి తోడు లేక ఒంటరిగానే కంటనీరు కుక్కుకొని కాలాన్ని నెట్టుకొచ్చింది.

'ఠంగ్' మన్న శబ్దానికి ఉలిక్కిపడింది సునీల.

వంటగదిలో అటకమీదున్న కంచు కంచం క్రింద పడ్డ శబ్దానికి పిల్లలు కూడా పుస్తకాలొదిలి హాల్లోకొచ్చారు.

ఛటుక్కున ఆలోచన్లు వదిలి కుర్చీలో నుంచి లేచింది.

''మీరెల్లి చదువుకోండమ్మ. నేను చూస్తాను లెండి.'' క్రిందపడ్డ కంచాన్ని పైన పెడుతూ భయం. .భయంగా ఓ మూలన నక్కి కూర్చున్న పిల్లిని చూసి నవ్వుకుంది.

చేత్తోనే పిల్లిని అదిలించి తరిమేసింది.

హాల్లోకొచ్చి కూర్చుంది.

వీధిలో కుర్రాళ్ళు హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు.

అనుకోకుండానే గడియారం కేసి చూసింది.

అప్పుడే గంట గడిచిపోయింది.

మరో మూడు గంటల్లో కాలగర్భంలో కలిసిపోబోతున్న ఈ ఏడాది ఎంత కమ్మగా సాగింది.

ఏనాడూ కలగని ఎన్ని ఆలోచనలు..?! ఎన్ని అనుభవాలు..!? ఎన్ని అనుభూతుల్ని కలిగించింది.

ఏడాది క్రితం......?!

ఆలోచనలతో వెనక్కి చేరగిలబడి కళ్ళు మూసుకుంది.

ఆమెకు తెలియకుండానే 'రిమోట్'తో 'టీవీ' నోరు నొక్కేసింది.

ఎన్నో ఏళ్ళుగా 'ఆయన'తో తనకి పరిచయం. ఏనాడూ ఆయనంటే తనకెలాంటి అభిప్రాయం కలగలేదు.

కానీ-

ఈనాడెందుకో ఈ అనుభూతి.

''మీరెప్పుడూ హాయిగా....ఆనందంగా ఉండడానికి ప్రయత్నించండి. ఏదో పోగొట్టుకున్నట్టూ ఆలోచిస్తూ ఒంటరిగా గడపకండి.''

''ప్రతి పనికీ మీరే ఎందుకు వెళ్తారు. నేనున్నాగా. మీకే అవసరం వచ్చినా నాకు చెప్పండి.''


''మీతో మాట్లాడుతున్నంత సేపూ నా మనస్సెందుకో చాలా ఆనందంగా...హాయిగా ఉంటుందండి. నిజం!''

''మీరిక్కడ్నుంచి వెళ్ళిపోతారా?''

బేలగా అన్న ఆయన మాటల్లో ఏదో ప్రార్థన. ఏదో ఆకర్షణ. కళ్ళల్లో మరేదో అభ్యర్థన.

ఆయన మాట్లాడుతున్నంత సేపూ అలాగే చూస్తూ కూర్చోవాలనిపిస్తుంది. ఆయన ఇంట్లో ఉన్నంత సేపూ ఆయన్నే తదేకంగా చూడాలని మనసు తపిస్తుంది.

కానీ-?!



పిల్లలు!!!

ఎదిగిన పిల్లల ముందు తన హుందా...హోదా మర్చిపోయి మరోలా ప్రవర్తించ గలదా?!

సమాజానికి...సంసారానికి తలొగ్గి సంస్కారంతో మనసుని మెదడుని అదుపులో పెట్టుకుంది సునీల.

అయినా-ఆయన మాటల్లో దాగిన అభిమానం, ఆయన చేతల్లో కనిపించే ఆప్యాయత, ఆయన కళ్ళల్లో కదలాడే అనురాగం... ఎలా తట్టుకోగలదు? ఎలా మర్చిపోగలదు?

ఏడాదిలోనే ఆయన అందరికీ తల్లో నాలుక య్యారు. తనకేకాదు- పిల్లలకీ ఆయన రాని రోజు ఎదురుచూసే సమయం ఎక్కువయింది.

రోజు తప్పించి రోజూ ఏదో పని మీద ఏదో వంకతో వచ్చే ఆయన మీద తనకేనాడూ కోపం కలగలేదు. అసహ్యం కలగలేదు. ఏవగింపూ కలగలేదు.

చుట్టు పక్కల అమ్మలక్కలు నోళ్ళు నొక్కుకుంటారని కూడా తను ఆలోచించలేదు. వాళ్ళ నోళ్ళకి భయపడనూ లేదు.

ఆయనా అంతే!!

లోకులు పలుకాకులని, కాకులే అమ్మలక్కలై గత జన్మ వాసనల్ని వదలక అందరి గురించి గుసగుసలాడుకుంటారని అంటుంటారు.

''ఈ రోజంతా మీరే గుర్తొచ్చారండి. స్కూలుకి వెళ్ళినప్పుడు పనుండి బట్టల షాపుకెళ్ళాను. అక్కడ ఇదిగో ఈ బాబా ఫోటో ఇచ్చారు'' అంటూ బాబా ఫోటో ఇచ్చినప్పుడు.....ఆ క్షణం ఆయన కళ్ళల్లో మెరిసిన మెరుపు తనెలా మరచిపోగలదు?

పవిత్రమైన స్నేహానికి ఎల్లలూ ఉండవు. కల్లలూ ఉండవు. కల్లాకపటం లేని మైత్రిని సమాజమే కాదు, ప్రపంచమూ అర్థం చేసుకోలేకపోవచ్చు.

మనసులోనే మననం చేసుకుంది సునీల.

గోడ గడియారం గంటల మోతకి ఉలిక్కిపడింది.

గబుక్కున గడియారం కేసి చూసింది.

సరిగ్గా పన్నెండయ్యింది.

గుండె దడ అధికమయింది.

ఆమె హృదయ స్పందన ఆమెకే సుస్పష్టంగా లయబద్ధంగా విన్పిస్తోంది.

ఫోన్‌కేసి చూసింది.

నిశ్చలంగా..నిశ్శబ్దంగా ఘోర తపస్సులో మునిగి ఉన్న మునిలా ఉంది 'టెలీఫోన్'.

''టిక్...టిక్..టిక్..''మంటూ గోడగడియారం-నడక....''లబ్..డబ్..లబ్..డబ్'' మంటూ గుండె దడ.

ఈలోపల గదిలో నుంచి 'గుర్ర్....గుర్ర్....గుర్ర్' మంటూ పిల్లల గురకలు.

అన్యమనస్కంగానే వాలు కుర్చీలో నుంచి లేచి గదిలోకి వెళ్ళింది.

పిల్లలిద్దరూ చదివి చదివి పుస్తకాల మీద తలలు ఆన్చి నిద్రపోతున్నారు.


ఇద్దర్నీ ఒద్దికగా ఎత్తుకొని మంచం మీద వేసింది. లైటార్పేసి హాల్లో కొచ్చింది సునీల.


బైట వీధిలో కేకలు....అరుపులు..!

ఒకర్నొకరు శుభకాంక్షలతో ఆలింగనాలు చేసుకుంటూ అరుస్తున్న అరుపులు ఎంతో సుతారంగా ఆమె హృదయాన్ని వీణ మీటినట్లు మీటుతున్నాయి.

సరిగ్గా సంవత్సరం క్రితం-

ఇదే సమయంలో-




అందరం గాఢ నిద్రలో ఉన్నప్పుడు 'ఫోన్' మ్రోగింది. అర్ధరాత్రి ఈ మద్దెల దరువేమిటని విసుగ్గానే లేచి ఫోన్ ఎత్తింది.

''విష్ యూ హేపీ న్యూ ఇయర్'' అంటూ ఆయన.

తనకా క్షణం వల్లమాలిన కోపం కలిగింది. నిద్రమత్తుమీద చికాకులో 'సేమ్ టు యూ' అనలేదు సరికదా, 'షేమ్' చేసినట్టూ 'ఫోన్'చిరాగ్గా క్రెడిల్ చేసింది.

కానీ-

ఈఏడాది-

ఈరోజు-

ఎందుకిలా ఇంత ఆత్రంగా ఎదురు చూస్తోంది.

ఈఏడాది కాలంలోనూ ఎన్ని పండగలు....ఎన్ని అభినందనలు.....ఎన్ని పలకరింపులు.....ఎంత పసందుగా గడిచిపోయింది.

గాలి తగలకుండా బంధిస్తే 'మైన'మైనా రాయి కంటే గట్టిదవుతుంది. మంచి మనిషి మాట స్పర్శకు బాధల బంధిఖానాలో బండబారిన హృదయం ఎలా కరిగిపోతోంది?

ఒకటి...రెండు.... మూడు... .నాలుగు... .అయిదు....ఆరు.... నిమిషాలు.....గంటలూ ఆమెకు తెలియకుండానే దొర్లిపోయాయి.

కానీ-టెలీఫోన్ మ్రోగలేదు.

ఈ ఆరుగంటల్లోనూ అరవై ఆరు సార్లు 'ఫోన్'ఎత్తి చూసింది. పని చేస్తోందో...పాడైందోనని బెంగతో ఎన్నో పిచ్చి...పిచ్చి నెంబర్లకు 'డయల్'చేసింది.

సక్రమంగానే రింగ్ వెళ్తోంది.

తనకే 'ఫోన్' రింగవలేదు.

మొట్టమొదటిసారిగా ఆమె హృదయం ఆమెకే తెలియని విధంగా మూగగా ఆక్రోశించింది.

ఈలోగా పిల్లలు లేచారు.

ఆప్యాయంగా ఆనందంగా తల్లిని కౌగిలించుకొని 'శుభాకాంక్షలు' తెలి పారు.

''అంకుల్ ఇంకా రాలేదు కదూ!'' నిష్ఠూరంగా అంది అమ్మాయి.

''లేదమ్మా!'' అంటూనే దిగ్గున లేచి ఇంటి పనిలో లీనమయింది సునీల.

గొంతులోనూ....గుండెలోనూ కదలాడే కదలికల్ని కూతురు గమనించకూడదని సునీల తాపత్రయం.

ఎనిమిదో గంటకల్లా అన్ని పనులూ ముగించుకొని కూతుర్ని తీసుకొని బయలుదేరింది సునీల.

''ఎక్కడికమ్మా!'' అంది అమ్మాయి.

''అంకుల్ ఎప్పట్నుంచో వాళ్ళింటికి రమ్మంటున్నారు కదా. ఈరోజు ఆంటీకీ, అంకుల్‌కీ 'విషెస్' తెలిపినట్టూ ఉంటుంది, కొత్తిల్లు చూసినట్టూ ఉంటుంద''ని చెప్పింది.

గేటు తీసుకొని పోర్టికోలో అడుగు పెడుతుండగానే ఆయన ఎదురొచ్చారు.

''ఎంత శుభదినం. ఎంత అదృష్టం. రండి..రండి. మీ ఇంటికే బయల్దేరాను. మీరింకా నిద్రావస్థలో ఉంటారేమోనని భయపడి రాలేదు.'' ఒకింత నిష్ఠూరంగానే అన్నారు.

మనసు చివుక్కుమంది సునీలకు. ఈలోగా ఆయన శ్రీమతి ఎదురొచ్చింది.

''రండి! సునీలక్కా! రండి'' ఆదరంగా ఆహ్వానించింది.

ఓ అర్ధగంట వాళ్ళతో గడిపాక 'వస్తానని' చెప్పి లేచింది సునీల.

''ఎన్నో ఏళ్ళ తర్వాత మిమ్మల్ని ఇంత కళగా చూడటం ఇదేనక్క'' అంది ఆయన శ్రీమతి.

ఆమె ఆప్యాయతకి, అభిమానానికి సునీల మనసు పులకించింది.

''మీరు తోడుగా ఇంటి వరకూ వెళ్ళి సునీలక్కను సాగనంపి రండి.'' ఆయనతో అంది ఆమె.

సునీల మరేం మాట్లాడలేదు.

నడుస్తూనే నెమ్మదిగా తలఎత్తి ఆయనకేసి చూసింది. లాలనగా నవ్వుతూ...ఆలనగా తనకేసి చూస్తున్నట్టే ఉంది.

అనుకోకుండానే వెనక్కి తల తిప్పి చూసింది సునీల.

దూరంగా...మేడమీద నుంచి ఆయన శ్రీమతి మమ్మల్నే గమనిస్తూ ఆప్యాయంగా చేయూపుతోంది.

మనసున మనసై తోడొకరుండిన అదే భాగ్యమూ...అదే స్వర్గమూ....ఎక్కడ్నుంచో లీలగా వినిపిస్తున్న పాట విని ఆనందంగా కూతురు చేయి పట్టుకుంది సునీల. ★



## భానుప్రియ సలహా

'కెరీర్' అంటూ పరుగెడుతున్న నేటి హీరోయిన్స్‌కి, నిన్నటి అగ్రనటి భానుప్రియ ఒక మంచి సలహా ఇచ్చింది. భానుప్రియకు పెంపుడు తండ్రి కారణంగా పెళ్ళి కావడం లేదన్నది నిజం. నేను భానుప్రియ తండ్రినని చెప్పుకుంటూ చెన్నైలో బ్రోతల్‌హౌస్ నడుపుతూ చివరికి పోలీసులకు పట్టుబడిన ఆ వ్యక్తిని చూసి, భానుప్రియకు వస్తున్న మంచి పెళ్ళి సంబంధాలన్నీ తప్పిపోతున్నాయి. ఈ విషయం గురించి బాధపడుతూ ఈమధ్య భానుప్రియ తనకు అత్యంత సన్నిహితురాలయిన ఓ హీరోయిన్ దగ్గర ఇలా చెప్పుకుని బాధ పడిందట. 'నేను బిజీ హీరోయిన్‌గా ఉన్నప్పుడు ఎంతోమంది ఇండస్ట్రియలిస్టులు, చిత్ర ప్రముఖులు నా వెంట పడి 'పెళ్ళి' ప్రపోజల్ పెట్టారు. కాని అప్పుడు కెరీర్ మీద కాన్‌సన్‌ట్రేషన్‌తో ఆ ప్రపోజల్స్‌ని తిరస్కరించాను. తీరా బిజీ తగ్గాక 'పెళ్ళి' చేసుకుందామనుకుంటే, పెళ్ళికొడుకే కరువయ్యాడు. కాబట్టి ఏ హీరోయిన్ అయినా తన కెరీర్ బాగా ఉన్నప్పుడే పెళ్ళి చేసుకుని ఇండస్ట్రీకి గుడ్‌బై చెప్పడం మంచిది. లేకపోతే నా పరిస్థితే వాళ్ళకూ ఎదురుకావచ్చు..'' భానుప్రియ తన స్వానుభవంతో ఎంత మంచి సలహా చెప్పిందో వింటున్నారా హీరోయిన్లూ!

-జె.వి.బాబు.